విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 19, ఆగస్టు 2023

బాధ్యతలు స్వీకరించిన జేసీ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుక్రవారం తాటి మాకుల రాహుల్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన జేసికి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. డీఆర్ఓ పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు బోకేలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామ్యూన్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

సచివాలయం ఎదుట ఆందోళన

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు ఒకటో గ్రామ సచివాలయ పరిధిలో డిజిటల్ సహాయకులు లేకపోవడంతో వైఎస్సార్ చేయూత, తదితర పథకాలకు ధృవపత్రాలు అందించడంలో అధికారులు తీవ్ర అలసత్వాన్ని వహిస్తున్నారని గ్రామ ప్రజలు శుక్రవారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా సచివాలయంలో డిజిటల్ సహాయకుడు సెలవులో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. ఇన్‌చార్జి బాధ్యతలు వహించేవారు తమకు ఎలాంటి పనులు చేయడం లేదని వాపోయారు.ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నియోజకవర్గ కేంద్రమైన ఆళ్లగడ్డలో సాంకేతిక లోపం కారణంగా 5 గంటల సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాంకేతికలోపాల కారణంగా టౌన్-2 లో ఆగిపోయిన విద్యుత్ సరఫరాను విద్యుత్ ఏఈ కంబగిరి సిబ్బంది సహకారంతో త్వరితగతిన పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.అలాగే మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ కంబగిరి శుక్రవారం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్లో నియంత్రిక మెయింటనెన్స్ కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని ఏఈ కోరారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -అవుకు : మండల పరిధిలోని రామాపురంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 56వ జన్మదిన వేడుకలను వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య శుక్రవారం ఘనంగా జరిగాయి.గ్రామ నాయకులు రామ సుబ్బారెడ్డి, డీలర్ పుల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా కేకుకట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే రామ్మోహన్, రామాంజనేయులు,అశోక్ నాగరాజు దస్తగిరి, విశ్వనాథ రెడ్డి, బొబ్బల మధున్ మోహన్ రెడ్డి, బోయ రామచంద్రుడు, పాలనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

విశాలాంధ్ర -బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో బాలిక మిస్సింగ్ అయినట్లు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు.

వివరాలమేరకు కరీం బాగు వీధికి చెందిన చింత రాజేశ్వరి దేవి కుమార్తె చింత హర్షిత (16) గురు వారం రాత్రి 7.30 సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి ఇంటికి రాలేదన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నాగదేవతల ప్రతిష్ట

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని అబ్దుల్లాపురం గ్రామం నందు పురాతన శివాలయంలో నాగ దేవతల విగ్రహాల ప్రతిష్టను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు.గ్రామ పెద్దలు శివారెడ్డి, సంజీవరాయుడు,శ్రీనివాస ఆచారి, రామసుబ్బారెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో భక్తులు ప్రజలు ప్రతిష్ట మహోత్సవంలో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నాగదేవతల విగ్రహ ప్రతిష్టను గావించి విశేష పూజలు చేశారు. ప్రతిష్టానంతరం భక్తులకు వేద పండితులు తీర్థప్రసాదాలు అందించారు.

ప్రభుత్వం చుక్కల భూములను పట్టా భూమిగా మార్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం లక్షల ఎకరాల చుక్కల భూములను సెక్షన్ 22/ఏ కింద నిషేధ జాబితా తొలగించినా జిల్లా రెవెన్యూ అధికారులు వాటిని అమలు పరచకపోవడం విచారకరమని, చుక్కల భూములున్న రైతులు పట్టా భూమిగా మారకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ప్రభుత్వ అధికారులు చుక్కల భూములను పట్టా భూములుగా మార్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము చుక్కల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించిన నంద్యాల జిల్లాకు జీవో నెంబర్ 179 ద్వారా నిషేధిత నుండి తొలగించిన భూములు రిజిస్టర్ అయ్యేందుకు ప్రభుత్వం వీలు కల్పించిన కానీ భూమి స్వభావము అనే కాలంలో ప్రభుత్వ భూమి అని ఉన్నందున ఆయా సబ్ రిజిస్ట్రర్లు ఆఫీసులో సిస్టం తీసుకోకపోవడంతో రైతులకు అత్యవసర పరిస్థితిలో వాటిని అమ్ముకునేందుకు వీలు కావడం లేదని దీనికి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు.జిల్లా రెవెన్యూ అధికారులకు సీఎం సంతకం తో వచ్చిన పత్రాలను ఇంతవరకు సంబంధిత ఏ ఒక్క రైతుకు ఇవ్వలేదని, జిల్లా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంతవరకు ఆయా పొలాలు రిజిస్టర్ కానందున రైతులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే జిల్లా రెవెన్యూ అధికారులు ఆయా మండలాల్లో ఉన్న చుక్కల భూముల రికార్డులను తెప్పించుకొని వాటిని ప్రభుత్వ భూమిగా ఉన్న పొలాలను పట్టా భూమిగా మార్పు చేసి రిజిస్టర్ జరిగే విధంగా ఉమ్మడి ప్రొసీడింగ్ ఆర్డర్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

భూపోరాటాలకు సిద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపు

విశాలాంధ్ర - నంద్యాల : ఇళ్ల స్థలాలు, సాగు భూమిలేని పేదల కోసం భూ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా సమితి సమావేశం నంద్యాల సీపీఐ కార్యాలయం నందు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాగు భూముల కోసం ఉపయోగపడే ప్రభుత్వ భూములు, ఇండ్ల స్థలాల కోసం ఉపయోగపడే భూములున్నాయని, వాటిని భూస్వాములు, అధికార పార్టీ నాయకులు, ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని, వాటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘంగా భూ పోరాటాల ద్వారా భూములను పేదలకు స్వాధీనం చేసి ఇవ్వడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ నెలలో బాపట్లలో జరుగుతున్నాయని, రాష్ట్ర మహా సభల జయప్రదానికై సంఘ సభ్యులు నాయకులు అందరు కృషిచేసి జిల్లా నుండి ఎక్కువమంది వ్యవసాయ కార్మికులను సమీకరించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప కార్యదర్శి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఉపాధ్యక్షురాలు మహేశ్వరమ్మ, కోశాధికారి లక్ష్మీదేవి, మాణిక్యమ్మ ముంతాజ్, రాని, బాల వరదరాజు, సుంకన్న సామేలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో మరింత వేగవంతం పెంచండి

విశాలాంధ్ర -వెలుగోడు : మండల కేంద్రమైన వెలుగోడులో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ లేవుట్లను పరిశీలించి, ఇళ్ల నిర్మాణాలను ఇంకా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సాముల్ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలో 95 ఇళ్ళు పూర్తి అయ్యాయని హౌసింగ్ అధికారులు రిపోర్టు ఇవ్వగా , కలెక్టరుకు సందేహం వచ్చి పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది. నిర్మాణంలో ఉన్న ఇళ్లను కూడా పూర్తి అయినట్లుగా చూపించారా? అని ప్రశ్నించారు. కనీస వసతులైన నీరు , విద్యుత్, రోడ్లు నిర్మాణ ఏ మేరకు పూర్తి అయినట్లు ప్రశ్నించారు. బోర్లు వేశామని ఆర్.డబ్ల్యు.ఎస్. ఏ.ఈ పక్కిరయ్య చెప్పగా, పైపులు వేసి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నారు.కరెంట్ లేదని లబ్ధిదారులు తెలపగ, విద్యుత్ స్తంభాలు వేస్తున్నట్లు ఏ.ఈ రవీంద్ర నాయక్ తెలిపారు.రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ప్రధాన రోడ్డు ప్రక్కన ఉన్న నిర్మాణాలు కాకుండా లోపల ఉన్న నిర్మాణ పనులు పరిశీలించాలని, రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, నగేష్ నాయక్లు ఎస్టీల స్మశానవాటిక స్థలంఉన్న అధికారికంగా లేదని, ఆన్ లైన్ చేసి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. రామాంజనేయులు అనే వ్యక్తి నాకు ఇళ్ల స్థలం ఇచ్చినట్లు లిస్ట్‌లో పేరు ఉందని, కానీ నాకు ఇంత వరకు పట్టా ఇవ్వలేదని కలెక్టర్‌కు చెప్పారు. వెలుగోడు చెంచులకు వేంపెంట లో పొలం ఇచ్చారుకానీ ఇంతవరకు ఆన్ లైన్ కాలేదని,కలెక్టర్‌ను విలేకరి ప్రశ్నించగా వెలుగోడు తహశీల్దార్ నారాయణరెడ్డికి పాములపాడు తహశీల్దార్‌తోసంప్రదించి పరిష్కరించాలని ఆదేశించారు.కలెక్టర్‌వెంట హౌసింగ్ పి.డి. భాస్కర్ నాయుడు,ఈఈ.ఉమామహేశ్వరరావు, ఏ.ఈ. శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఈ, డి.ఈ. శ్రీనివాసులు, ఎంపిడిఓ అమానుల్లా, పంచాయతీ రాజ్ ఏ.ఈ శ్రీనివాసులు, సర్పంచ్ జైపాల్ , సచివాలయం సిబ్బంది ఉన్నారు.

వైయస్సార్ బీమా పేదలకు వరం

విశాలాంధ్ర-నందికొట్కూరు : వైయస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని మారుతినగర్ కౌన్సిలర్ లాలుప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మారుతినగర్ లో చెన్నయ్య అనే వ్యక్తి అకాల మరణంతో మృతి చెందిన జరిగింది. అయితే వారి కుటుం బీకులకు వైఎస్ఆర్ బీమా క్రింద కౌన్సిలర్ లాల్ ప్రసాద్ రూ.10వేలు అందజేశారు.ఈఅందజేసిన వారిలో సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయ కులు మధుసూదన్ రెడ్డి, ముచ్చుమర్రి భాష, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి కానుకలు పంపిణీ

విశాలాంధ్ర - బనగానపల్లె: నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెం దిన ఆరుగురు నవవధువులకు శుక్రవారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తన కార్యాలయంలో పెళ్లి కానుకలను అందజేశారు.

ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కీ.శే. బీసీ గుర్రెడ్డి, బీసీ లక్కమ్మ దంపతుల జ్ఞాపకార్థం నియోజకవర్గం లోని ఆయా గ్రామాల్లో కులమతాల అతీతంగా వివాహం చేసుకోబోయే నూతన వధువులకు ఉచితంగా పెళ్లి కానుక అందజేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా శుక్రవారం నాడు ఆరుగురుకు పెళ్ళికానుక అందజేసినట్లు తెలిపారు. 2022 నుంచి ఈ పెళ్లి కానుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇప్పటి వరకు 452 మందికి పెళ్లి కానుక అందజేశామని తెలిపారు.వధువు తరపున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

విశాలాంధ్ర -చాగలమర్రి: కేంద్రం గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని గోమహా పాదయాత్ర బృంద నాయకుడు వెంకటాచార్యులు కోరారు. గోమహా పాదయాత్ర శుక్రవారంచాగలమర్రి చేరుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలక్రిష్ణ గురుస్వామీ ఆధ్వర్యంలో 60 మంది ఈ నెల 6న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి ఈ పాదయాత్ర ప్రారంభించామన్నారు.తిరుమల,అరుణాచలం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. గో సేవతో హిందూ సంస్కృతికి రక్షణ లభిస్తుందన్నారు.గోహత్యలను నిషేధించి గోసంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు.గోవును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల మండలం పుసులూరు, గోస్పాడు మండలం తెళ్ళపూరి గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ను కలిసి కోరారు. ప్రధానంగా కుందు పరివాహక ప్రాంతాలలో కుందూ నుండి ఆయా గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుందని అయితే పరిశ్రమల కాలుష్యం వల్ల కుందూ నీరు కలుషితం అయ్యిందని ఇదే నీటిని డైరెక్ట్ పంపింగ్ చేస్తూ ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారని కలెక్టర్ కు భూమా వివరించారు. ఫలితంగా ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారని భూమా కలెక్టర్ కు తెలిపారు. నీటిని శుద్ధి చేసి లేదా ప్రత్యామ్నాయ పద్ధతిలో కుందూ పరివాహక ప్రాంత ప్రజలకు తాగు నీటిని సరఫరా చేయాలని భూమా కలెక్టర్ ను కోరారు.

నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలి

విశాలాంధ్ర-డోన్ రూరల్ : రాజకీయాలలో నీతిలేని నాయకుడంటే ధర్మారం సుబ్బారెడ్డి అని కౌన్సిలర్ దినేష్ గౌడ్ అన్నారు. స్థానిక వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే

కరుల సమావేశంలో దినేష్ గౌడ్ సుబ్బారెడ్డి వారి అనుచర గణంపై నిప్పులు చెరిగారు. ఆర్థిక మంత్రి బుగ్గన విలువలు కలిగిన వ్యక్తి అని అందులో వైసీపీ తరపున నీతి న్యాయంగా వ్యాపారాలు చేసుకుని జీవించే తమలాంటి వారిపై సుబ్బారెడ్డి అనుచర గణం అవాకులు చవాకులు పేలడం పద్ధతి కాదన్నారు. టీడీపీలోని అనుచర గణం ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదని దుయ్యబట్టారు. నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ అని చెప్పుకుంటూ కాలం గడిపే సుబ్బారెడ్డికి ఎన్నికలలో పోటీ చేసే సమయానికి ఆపదవి ఉంటుందో ఊడుతుందో తెలియని అయోమయ స్థితిలో కొనసాగుతున్నాడని అన్నారు.సమావేశంలో మహేంద్ర నాయుడు,రాజా, కొమ్మురవి, రంజిత్,రంగస్వామి, ప్రసాద్, భరత్ పవన్, నాసిర్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : మండలంలోని కోట కందుకూరు గ్రామ సర్పంచ్ ఎన్నికకు పోలింగ్ శనివారం జరగనుంది. అందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈఎన్నికలో ఐదుగురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గ్రామంలో 3,240 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.అధికారులు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక వాహనంలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయం నుండి కోటకందుకూరుకు తరలించారు. పెద్ద కందుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ కు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి తనిఖీ చేశారు. జిల్లాలో 18 స్థానాల్లో వార్డు మెంబర్లకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు.

చాగలమర్రి : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో 5వ వార్డు ఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి రామచంద్రరావు తెలియజేశారు. పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను ఎంపీడీవో మహబూబ్ దౌలా శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి బాలెట్ పేపర్లను అందజేసి పోలింగ్‌కు అన్ని సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఏఓ భరణి కుమారి,ఈవోపీఆర్డి సుదర్శన్ రావు, పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమార్,సబియాలు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-డోన్ :మెప్మాలో పనిచేస్తున్న ఆర్పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26,000 ఇచ్చి పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సుంకయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సుగుణమ్మ, ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య అబ్బాసులు డిమాండ్ చేశారు.శుక్రవారం డోన్ పట్టణంలోని కొండ పేటలో మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలు, ఏఐటీయూసీ లో చేరడం జరిగింది.అనంతరం జరిగిన సమావేశానికి చిగరమాను పేట ఫాతిమా అధ్యక్ష వహించారు .ఈ సమావేశాన్ని ఉద్దేశించి పి.సుంకయ్య,ఆర్.సుగుణమ్మ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వాల సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు చేరే విధంగా ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఇటు ప్రజలకు సేవలంది

స్తూ ప్రభుత్వాలకు మంచి పేరు తెస్తూ పనిచేస్తున్నారన్నారు. ఏదో ఒక రోజు ప్రభుత్వం గుర్తిస్తుందని ఎదురుచూస్తూ పని చేస్తున్న ఇంతవరకు వారి సమస్యల పట్ల ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితిలో తమకు న్యాయం చేసే పోరాటం చేసిన చరిత్ర ఉన్నటువంటి పోరాటాలు చేసి సాధించుకోవడం కోసం సిద్ధం కావడం అభినందనీయం అన్నారు.రాబోవు రోజుల్లో మెప్మాలో పనిచేస్తున్న ఆర్పిలందరినీ ప్రభుత్వం గుర్తించి, పని భద్రత కల్పించి ,పీఎఫ్ ,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ,పెన్షన్ సౌకర్యాలతో పాటు ,హెల్త్ కార్డు ఇచ్చి ఉచితంగా విద్య ,వైద్యం, ప్రభుత్వమే స్థలం ఇచ్చి పక్క గృహం నిర్మించి ఇవ్వాలని అనేక డిమాండ్స్ పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాడాలి సిద్ధం కావాలని ఆర్పి లకు పిలుపునిచ్చారు.

అనంతరం ఏఐటీయూసీ అనుబంధ మెప్మా ఆర్పిల నూతన ఏర్పాటు చేసుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షురాలుగా చిగరమానుపేట ఫాతిమా, అధ్యక్షులుగా ఇందిర, ఉపాధ్యక్షులుగా జి .రాధా ,సరోజ, నిర్మల భాయ్ ,ప్రధాన కార్యదర్శిగా సులోచన ,సహాయ కార్యదర్శిగా వి.రాధ, నాగమణి, కోశాధికారిగా హసీనా గౌరవ సలహాదారులుగా పుల్లయ్య, అబ్బాస్ లను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి: గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు తెలిపారు.శుక్రవారం మండలంలోని డి వనిపెంట చెంచుగూడెంలో మలేరియా, దోమల సంబంధిత ఇతర వ్యాధులు రాకుండా గూడెం లోను,

ఇళ్ళలో డిడిటిని పిచికారి చేసారు. అనంతరం గ్రామంలోని కాలనీలలో తిరుగుతూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలంటూ చెంచులకు అవ గాహన కల్పించారు.కార్యక్రమం లో చెంచుగూడెం స్పెషల్ ఆఫీసర్,పశుసంవర్ధక శాఖ ఏడి వరప్రసాద్,అసిస్టెంట్ డిఎంఓ వరప్రసాద్ రెడ్డి,ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ బాలస్వామీ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్,శేఖర్‌రెడ్డి,ఎంఎల్‌హెచ్‌పి పల్లవి,ఏఎన్ఎం సంధ్య,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్

విశాలాంధ్ర - నంద్యాల :పవర్ లిఫ్టింగ్ నందు రావూస్ జూనియర్ కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 16వ తారీఖున రాష్ట్రస్థాయిలో వైజాగ్ నందు నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ 65 పోటీల నందు రావూస్ జూనియర్ కళాశాల విద్యార్థి డి. సుమంత్ సీనియర్ ఎంపీసీ డెడ్ లిఫ్ట్ నందు గోల్డ్ మెడల్, బెంచ్ ప్రెస్ నందు సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ఏ.మోనిచంద్ర తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని అభినందిస్తూ రావూస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు తీసుకురావడమే కాకుండా క్రీడల నందు కూడా రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు.క్రమశిక్షణతో కలిగిన విద్యతోపాటు ఆసక్తి కలిగిన క్రీడాకారులను వారికి ఇష్టమైన ఆటల నందు ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సుమంత్ అనే విద్యార్థి ఈనెల 25న ఛత్తీస్ ఘడ్ నందు నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రము నుంచి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని తెలిపారు. సుమంత్ కు శిక్షణ ఇచ్చిన గురువు పుల్లయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రొద్ద సుంకయ్య, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గౌరు స్వగ్రామంలోనే దోచుకున్నారు

మాజీ ఎమ్మెల్యే లబ్బి

విశాలాంధ్ర- నందికొట్కూర్: నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయ కులు గౌరు వెంకటరెడ్డి తన సొంత గ్రామమైన బ్రాహ్మణ కొట్కూరులో ప్రజల నుంచి దోచుకున్నారే తప్పా గ్రామాభివృద్ధి చేసింది ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆరోపించారు. శుక్రవారం బ్రాహ్మణ కొట్టుకూరు సహకార సొసైటీ నూతన చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కార్య క్రమంలో బైరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, చంద్రమౌళి, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా సహకార సొసైటీ సీఈవో అశోక్ కుమార్ నూతనంగా ఎన్నుకోబడ్డ చైర్మన్, డైరెక్టర్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు.

మెలకువలు పాటిస్తే లాభాలు

విశాలాంధ్ర - చాగలమర్రి : గొర్రెలు, మేకల పెంపకంలో పెంపకం దారులు మెలకువలను పాటిస్తే ఆశించిన ప్రయోజనాలను పొందుతారని పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టరు వరప్రసాద్ తెలిపారు.శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన గొర్రెలు, మేకల పెంపకం దార్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు పెంపకం దార్ల శిక్షణలో తెలియజేసే మేలైన యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలన్నారు.జీవాల్లో వచ్చే వ్యాధులు,మేలైన యాజమాన్య పద్ధతులు, గొర్రె, మేక పిల్లల పోషణ, పరాన్న జీవుల వలన వచ్చే వ్యాధుల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సాయిబాబా,రవి,గొర్రెల పెంపకం దారులు,పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంటలో పొలంబడి

విశాలాంధ్ర ఆత్మకూరు టౌన్ : మండలంలోని ఆత్మకూరు గ్రామంలో డా.వైఎస్ఆర్ పొలం బడి కార్యక్రమం కందివంటపై నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి జీ.లతమ్మ మాట్లాడుతూ విత్తన శుద్ధి, మొలక శాతం గురించి వివరించడం జరిగింది. విత్తనశుద్ధి చేసుకోవడంతో నెల రోజుల వరకు విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు. అదేవిధంగా మొలక శాతం ద్వారా నాణ్యమైన విత్తనాన్ని తెలుసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ శివ నాయక్ మాట్లాడుతూ రైతులు జీవామృతంతో విత్తన శుద్ధి చేసుకునే విధానాన్ని, వేప కషాయం తయారీ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ హాజీ బైరాపురం మహబూబ్ బాషా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరేంద్ర గౌడ్, రమేష్ నాయక్, శశికళ, వాజిద్, వ్యవసాయ శాఖ సిబ్బంది రవి గౌడ్, సావిత్రి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు-చైర్మన్

విశాలాంధ్ర-బేతంచెర్ల రూరల్ : పట్టణంలోని జెండాపేట కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొ న్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి గడప గడపకు తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న నవరత్నాలను వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి అమ్మఒడి,జగనన్న చేయూత, రైతు భరోసా, వాహన మిత్ర,వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు,మన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని,ప్రజలు విజ్ఞతతో

ఆలోచించి,మంచి చేసే వారిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు ఖాజా హుసేన్,సలీం, కౌన్సిలర్ ఇబ్రహీం, మూర్తి జావలి,తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర - హొలగుంద: పరిధిలోని లింగదహళ్లిలో నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గీత ఇంట్లో ఎవరు లేని సమయంలో పెట్రోల్ పోసుకొని అగ్గి పెట్టుకొని కాల్చుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు నెల్లూరులోని విద్యార్థిని గీత సుమ నర్సింగ్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతుందని అయితే మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయినందున దిగులు చెంది భవిష్యత్తులో నర్సింగ్ కోర్సు పూర్తి అవుతుందో లేదో అనే భయంతో ఆత్మహత్య చేసుకుందని అన్నారు 40% శరీరం కాలిందని బళ్ళారి విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని అన్నారు ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు

సచివాలయాల్లో నగదు రహిత చెల్లింపులు

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నగదు రహిత చెల్లింపులుప్రారంభించినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

శుక్రవారం స్థానిక సచివాలయంలో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీల జనాభాను బట్టి బ్యాంకు అధికారులు పి వై ఎస్ మిషన్లు, క్యూఆర్ కోడ్ లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక నుండి కుళాయి పన్ను, నీటి పన్ను పంచాయతీలకు సంబంధించిన చెల్లింపులన్ని నగదు రైతంగానే జరగనున్నట్లు ఎంపీడీవో స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 19, ఆగస్టు 2023

బస్సుయాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర – కోడుమూరు : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో యావత్ ప్రజానీకం తీవ్రంగా నష్టపోతున్నారని,పాలకుల నుంచి దేశాన్ని కాపాడాలని,రాష్ట్రాన్ని రక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది.మండల కార్యదర్శి బి.రాజు అధ్యక్షతన జరిగిన సమావేశమునకు ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణలు మాట్లాడుతూ దేశ,రాష్ట్ర ప్రజలకు భద్రతలేని పరిపాలన కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మతోన్మాదంతో మైనార్టీలు, మహిళలు, మేధావులు, రచయితలు, దళితులు, గిరిజనులపై అనేక దాడులు జరిగాయన్నారు.దేశంలో రైతులు,కార్మికులకు భద్రతలేని నల్ల చట్టాలను తీసుకొచ్చి,అన్నం పెట్టే రైతన్న, కార్మికుల పట్ల తీరని ద్రోహానికి పాలకులు పాల్పపడుతున్నారని పేర్కొన్నారు.మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు కొనసాగిస్తూ,నగ్నంగా ఊరేగించడం ఘోరమైన చర్య అన్నారు దేశవ్యాప్తంగా భరతమాత ముద్దుబిడ్డలను అవమానించడం ప్రభుత్వ సిగ్గుచేటుకు నిదర్శనమన్నారు రాష్ట్రంలో వైసీపీ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలు చేపట్టి,తాను అధికారం లోకొస్తే మీ కుటుంబంలో ఒకరిగా ఉంటానని కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారంలోకొచ్చి నాలుగు ఏళ్ళ నుంచి ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. దేశంలో సామాన్య ప్రజలు బతకలేని విధంగా నిత్యవసర సరుకులు దరలు పెంచేసి,పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలను పెంచేసి ప్రజలపై పెనుబారం మోపారని తెలిపారు.రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి,కొత్త ప్రాజెక్టులను నిర్మించి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తానని వాగ్దానం చేసిన పెద్దమనిషి అధికారంలోకొచ్చి నాలుగున్నర ఏళ్ళలో ఒక్క ప్రాజెక్టు కూడా శంకుస్థాపన చేయలేదని," ఎండింగ్‌లోని ప్రాజెక్టులలో ఒక్క రాయి కూడా కదల్చలేదని విమర్శించారు. ఈనెల 17నుంచి విశాఖలో మొదలై, సెప్టెంబర్ 8 వరకు సీపీఐ బస్సుయాత్ర కొనసాగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మునిస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి ఆటో మధు, గూడూరు మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు, హమాలి వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి. బజారి వర్కూరు గ్రామశాఖ నాయకులు రంగన్న,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఓబులేసు, ఎరుకల సంఘం నాయకులు నాగరాజు, గూడూరు హమాలీ కార్మికులు మల్లి,శివ సి.బెళగల్ నాయకులు శేషు, నాగరాజు,దుబ్బన్న, ఇంద్రజిత్తు గుప్తానగర్ కాలనీ వాసులు రుక్మాంగధరరెడ్డి, నర్సప్ప మద్దిలేటి,శేఖర్ ఆచారి మహిళలు దస్తగిరమ్మ, ఈరమ్మ,వెంకటేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేదావతి గర్జన బహిరంగ సభను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర – ఆలూరు : సెప్టెంబర్ 2వ తేదీన ఆలూరు పట్టణంలో సీపీఐ బస్సు యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్న వేదవతి గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వేదవతి గర్జన బహిరంగ సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి లు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరూపిస్తూ రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ఆధ్వర్యంలో సీపీఐ బస్సు యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే సెప్టెంబర్ 2న ఆలూరులోకి ప్రవేశిస్తుందన్నారు. జిల్లాలో ఆలూరు నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, తాగునీటికీ సైతం తుంగభద్ర దిగు కాలువ మీద ఆధారపడి ఇక్కడి ప్రజలు జీవనం చేస్తున్నారన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కావాలంటే వేదవతి ప్రాజెక్టు నిర్మాణమే ఏకైక శరణ్యమన్నారు. దేవనకొండ మండలంలోని హంద్రీనీవా పందికోన రిజర్వాయర్ కుడి కాలువ స్థిరీకరణ పనులు, పంట కాలువలు నిర్మాణం పూర్తి చేసి 45 వేల ఎకరాలకు సాగునీరు, అన్ని గ్రామాలకు త్రాగునీరు అందించాలన్నారు. ఆస్పరి మండలాన్ని వేదావతి ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలన్నారు. ఆలూరు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ పాలిటెక్నిక్‌కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, హెులగుంద నుండి ఆదోని మార్గమునకు రోడ్డు నిర్మాణాన్ని పెద్ద ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని, ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల సాయికి మించి అన్ని రకాల వైద్య ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని, నిలిచిపోయిన నగరడం రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టి సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలోసీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి పోతూరప్ప, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు శివ, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి రంగన్న, సీపీఐ నాయకులు సిద్ధలింగ, పులి, రంగన్న, బండయ్య, నాగరాజు, చాపల గోపాల్ లు పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి

విశాలాంధ్ర – ఆస్పరి : వేదవతి ప్రాజెక్టుకి నిధులు కేటాయించి తక్షణమే పనులు ప్రారంభించాలని సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తిలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సెప్టెంబర్ 2వ తేదీన ఆలూరు పట్టణంలో జరుగు బహిరంగ సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం లో వలసలు నివారించడానికి వేదవతి ప్రాజెక్టు నిర్మాణమే ఏకైక మార్గం అన్నారు. ఈనెల 17వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర బస్సు యాత్ర సెప్టెంబర్ 2న ఆలూరులోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలూరులో జరగనున్న భారీ బహిరంగసభ పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు కే.ఉరుకుందప్ప, బి.ఉరుకుందప్ప, వీరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడ విజయవంతం చేయండి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర – కర్నూలు : మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆగస్టు 22న విజయవాడలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప పిలుపు నిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల నుద్దేసించి మునెప్ప మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు చర్చలకు పరిమితం తప్ప పరిష్కారం కావడంలేదన్నారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆవైపు ఆలోచించడం లేదన్నారు. ముఖ్యమంత్రి అర్జీలు తీసుకొని 50 రోజులు దాటిన కార్మికులకు పిఎఫ్ ఈ సమస్యలు ఎక్కడ పరిష్కారం కావడం లేదన్నారు. పర్మినెంట్ కార్మికులకు జిపిఎఫ్ ఖాతాలు తెరవలేదని కరోనా విపత్తుల్లో ప్రాణాలు తెగించి పనిచేసే మరణించిన కార్మికులకు ఇంతవరకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, డిప్యూటీ సెక్రెటరీ రామాంజనేయులు ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అయ్యరాజు పాల్గొన్నారు.

పిచ్చోడడిగిన సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా



విశాలాంధ్ర– హెులగుంద: ఆలూరు నియోజకవర్గంలోని ప్రజలతో పాటు ఎవరైనా సరే పిచ్చోడు వచ్చి అడిగిన సమా ధానం ఇవ్వడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు హెబ్బటంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది సచివాలయంలో సిబ్బందితో మాట్లాడి సమావేశాలు జరిపి అభివృద్ధి పనులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ హెబ్బటం గ్రామానికి వైఎస్ హయంలో ఇరవై మూడు కోట్ల 40 లక్షల 755 రూపాయలు ప్రజల ఖాతాలోకి నేరుగా జమయాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీన ప్రకారం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అన్ని విధాల ఆదుకున్న ఘనుడని కొనియాడారు అయితే హెబ్బటంలో కరుడుగట్టిన టీడీపీ నాయకులకు నేరుగా వివిధ సంక్షేమ పథకాల డబ్బులు జమయాయని ఇంతకన్నా అభివృద్ధి ఏమి కావాలని అన్నారు టిడిపి నాయకులు కుటిల రాజకీయాలతో గిట్టక తాగుబోతులను మద్యం తాపించి మంత్రిని అడ్డుకోవాలంటూ పురిగొల్పిస్తే భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు తాటాకు చప్పుళ్లకు తాను బెదిరి అదిరే వ్యక్తి కాదని, తాను ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటానని ప్రజలు ఎవరైనా సరే నీరుగా వచ్చి సమస్యలు చెప్పితే పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సహకరిస్తానని అన్నారు అయితే మంత్రిని అడ్డుకోవాలంటూ కొందరు వచ్చి అల్లరి చేష్టలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు ఇలాంటి తప్పుడు పనులు మానుకొని అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు .

తహశీల్దార్ సేవలు ప్రశంసనీయం..

విశాలాంధ్ర– పత్తికొండ: మండల తహ శీల్దార్ విష్ణు ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా అధ్యక్షులు పులికొండ మాదిగలు పేర్కొన్నారు. శుక్రవారం తహశీల్దార్ విష్ణు ప్రసాద్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేసిన విష్ణు ప్రసాద్ సేవలకు జిల్లా అధికారులు ఉత్తమ తహశీల్దార్ అవార్డు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ నాయకులు రంగస్వామి,రాజు, సుధాకర్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : ఈనెల 18 ,19వ తేదీలలో జరగనున్న ఎనిమిదవ రాష్ట్రస్థాయి ఆట్యా..పాట్యా పోటీలలో కర్నూలు జిల్లా జట్టు విజయం సాధించి జిల్లా ప్రతిష్టతను ఇనుమడింప చేయాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు . శుక్రవారం నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులను ఆయన పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆట్యా..పాట్యా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ మన దేశం డెమోక్రసీ, డెమోగ్రఫి, డైవర్సిటీకి ప్రతి రూపమని వివరించారు. క్రీడాకారులు ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని, అప్పుడే క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని డా. శంకర్ శర్మ వివరించారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..

విశాలాంధ్ర– వెల్దుర్తి రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ బొమ్మిరెడ్డిపల్లె లక్ష్మీ నగరం గ్రామంలో నేడు జరిగే వార్డు ఎలక్షన్స్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్షన్ ప్రక్రియ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎలక్షన్ జరుగుతుం దన్నారు. ఎలక్షన్ జరిగే వార్డులో 144 సెక్షన్ ఉంటుందని ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

గ్రామ యువకుడే.. పాఠశాల ఉపాధ్యాయుడు

విశాలాంధ్ర–కోసిగి : మండల పరిధిలోని కోల్మన్ పేట పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం నుండి పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో గ్రామంలో ఉన్న అంజి అనే యువకుడే పాఠశాలకు ఇన్చార్జ్ ఉపాధ్యాయుడిగా మారాడు. వివరాల్లోకెళ్తే పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 260 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఏడు మంది ఉపాధ్యాయులు ఉండాలి. అయితే ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఒకరు ప్రధానోపాధ్యాయుడు, మరోకరు ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడు గత మూడు రోజుల నుంచి సెలవులో ఉన్నాడు. మరో ఉపాధ్యాయుడు తనకు పరీక్షలు ఉన్నాయని ఉన్నట్టుండి ఉదయం నుంచి క్లాసులు నిర్వహించి మధ్యాహ్నానికి ప్రధానోపాధ్యాయుడికి సమాచారం ఇచ్చి వెళ్లిపోవడం జరిగింది. ఆ ఉపాధ్యాయుడు గ్రామంలో ఉన్న యువకుడికి క్లాసులు చూడాలని చెప్పి పోవడం విడ్డూరంగా ఉందని, గ్రామస్తులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరక్షరాస్యత కు మారుపేరైన కోసిగి మండలంలో ఇలా ఇష్టానుసారంగా ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు చేసే పనులను చూసి గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ , విధులకు దుమ్మా కొడుతున్నారు. జిల్లా అధికారులు మండలం వైపు ప్రత్యేక దృష్టి ఉంచి మండల విద్యాభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈఓ మోహినుద్దీన్ కు వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ చేపట్టి తప్పు ఎవరిదో తెలుసుకుని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టివేత

విశాలాంధ్ర–కర్నూలు : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని మాధవరం పోలీస్ పరిధిలోని మాలపల్లి గ్రామంలో ఎక్సైజ్ సబ్ డిపార్ట్మెంట్ వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజల్ల గ్రామం గోనెగండ్ల మండలానికి చెందిన ఉరుకుంద అలాగే వెంకటాపురం గ్రామానికి చెందిన సమర ఇద్దరు ద్విచక్ర వాహనాలపై 18 బాక్సులు 1720 టెట్రా ప్యాకెట్లను తీసుకెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు వీరిని అరెస్టు చేసి వీరి దగ్గర ఉన్నటువంటి టెట్రా ప్యాకెట్లను స్వాధీనం పరుచుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు అలాగే ఈ మద్యం ప్యాకెట్లు సుమారు లక్ష రూపాయలు విలువ చేసి ఉంటుందని పోలీసులు తెలిపారు ఎస్ఐ సోమశేఖర్ కానిస్టేబుల్ రబ్బాని రాధమ్మ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పులికొండ వాసికి డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర– పత్తికొండ: మండల పరిధిలోని పులికొండ గ్రామానికి చెందిన రమేష్ నాయుడుకి యోగివేమన విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది. రసాయన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కట్ట వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో "డెవలప్ మెంట్ ఆఫ్ సస్టైనబుల్ మెథడాలజీస్ టు ఆక్సేస్ ఇమైన్స్, హెటిరో సైక్లిక్స్, బై ఆరైల్స్, కార్బో మేట్స్, అండ్ ఫ్యాటీ ఆసిడ్ ఎస్టర్స్" అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను రమేష్ నాయుడు డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు రమేష్ నాయుడు కి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సహాయం

విశాలాంధ్ర–కర్నూలు: మంత్రాలయం మండల పరిధిలోని 52 బసాపురం

గ్రామానికి చెందిన(సాగునీటి సలహా సంఘం మండల కోశాధికారి) కుమ్మరి అన్నయ్య గుండె జబ్బుతో కర్నూలు లోని గౌరీ గోపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జి. భీమారెడ్డి ఆస్పత్రికి చేరుకుని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ 15 వేలు ఆర్థిక సహాయం అందించి పరామర్శించారు. . ఎల్లప్పుడు రాంపురం రెడ్డి సోదరులు, మేము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈయనతో పాటు కల్లుదేవకుంట వైఎస్సార్సీపీ నాయకులు సుంకన్న, బసాపురం గ్రామం వార్డు సభ్యులు బడేసాబ్ తదితరులు ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేద్దాం

ఎమ్మిగనూరులో..

విశాలాంధ్ర – కర్నూలు: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం పరిమళ జూనియర్ కళాశాలలో మహాసభల కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీరాములు గౌడ్,జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర,షాభీర్ బాషా,థామస్ లు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనేక

పెద్దకడబూరులో..

పోరాటాలు నిర్వహించిందని అందులో భాగంగానే ఉన్నత విద్యకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేయాలని,జీఓ వలన పీజీ చదివే విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చదివితే ఫీజులను ప్రభుత్వం ఇవ్వదని, కేవలం యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు మాత్రమే ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుందని ఇది విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సిన పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం దూరం చేసి విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు.విద్యార్థులకు ఇవ్వాల్సిన అమ్మ

అదోనిలో..

ఒడి,విద్యాదీవెన, వసతిదీవెన నిధులను పూర్తిగా చెల్లించ కుండా రకరకాల కొర్రీలు పెట్టి విద్యార్థులకు అరకొరగా చెల్లింపులు చేస్తున్నారు. చివరకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉచితంగా అందించాల్సిన వైద్య విద్యను పూర్తిగా ప్రైవేట్ పరం చేసి రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని, దీంతో పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించే వారు తీవ్రంగా నష్ట పోతారని,వంద శాతం ఉచితంగా వైద్య విద్యలో సీట్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.అదేవిధంగ దేశవ్యాప్తంగా ఎంతో పేరుప్రఖ్యాతలు గాంచిన మంత్రాలయంలో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళా

పత్తికొండలో..

శాల లేకపోవడంతో ఇక్కడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో అధికశాతం వలసలు పోతున్నారని,కావున ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్థానిక ప్రజా ప్రతినిధులను డిమాండ్ చేశారు.వీటన్నింటిపై చర్చించేందుకు జిల్లా నిర్మాణ మహాసభలను ఈనెల25న కర్నూలు నగరంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కరపత్రాలను విడుదల చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరనాగుడు, రవిచంద్ర, నాయుడు, మనోజ్, షైక్షావలి, నవీన్, అనిల్, కిరణ్, అభినయలు పాల్గొన్నారు.

హెులగుందలో..

జగన్‌ను మరోమారు సీఎంగా దీవించండి

విశాలాంధ్ర– పెద్దకడబూరు : సంక్షేమ ప్రధాత జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా దీవించాలని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నతుంబలంలో ఎంపీడీఓ శ్రీనివాస

రావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. మరోమారు సీఎం జగన్‌ను, ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని ఆశీర్వాదించాలని కోరారు. వారివెంట వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, రవీంద్ర, గజేంద్రరెడ్డి, పూజారి ఈరన్న, మాజీ ఎంపీటీసీ యల్లప్ప, జాము మూకన్న, తెలుగు చిన్న వీరేష్, కడబూరప్ప, లక్ష్మన్న, యోహాను, షాదిక్ భాష , గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు మొక్కలు నాటండి - మేయర్

విశాలాంధ్ర, బ్యూరో కర్నూలు : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని నగర మేయర్ బీవై రామయ్య, అన్నారు. డీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బివై రామయ్య హాజరయ్యారు. కళాశాల ముందు చెట్లు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో అటవీశాతం తక్కువగా ఉందన్నారు. దీంతో పర్యావరణ సమతుల్యత కరువైందన్నారు. చెట్లు లేకపోవడం వల్ల సకాలంలో వర్షాలు కూడా కురవడం లేదన్నారు. ఉన్న చెట్లను కూడా మనుషులు తమ అవసరాల కోసం నరికేస్తున్నారు అన్నారు. దీంతో చెట్లు అంతరించిపోయి కరువు కు దారి తీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతిఒక్కరు బాధ్యత తీసుకొని విరివిగా చెట్లు నాటాలన్నారు. చెట్ల ద్వారా మంచి ప్రాణవాయువు అందడమే కాకుండా పండ్లు, ఫలాలు కూడా అందుతాయన్నారు. డీసీబీ బ్యాంక్ ప్రతినిధులు సామాజిక బాధ్యత కింద చెట్లు నాటే కార్యక్రమానికి పూనుకోవడం అభినందనీయ మన్నారు. మిగతావారు కూడా విరివిగా చెట్లు నాటి అందరికీ ప్రాణవాయువు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ సమితి సభ్యులు నాగరాజు, రాం ప్రతాప్, డీసీబీ బ్యాంక్ రీజనల్ హెడ్ లక్ష్మి నారాయణ, క్లస్టర్ హెడ్ హరి ప్రసాద్, బ్రాంచ్ హెడ్ బిలహన్ నాయుడు, హెచ్ ఆర్ దిలీప్,సిబ్బంది రంగస్వామి లు పాల్గొన్నారు.

దోమకాటు పట్ల అప్రమత్తతతో మెలగాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : పగటి పూట దోమ కాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా.జి సృజన ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నందు ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచి నీటిని నిల్వ ఉంచుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకు నేలా చూడాలని కలెక్టర్ సూచించారు.. మంచి నీటిలో పెరిగే దోమల వల్లే డెంగ్యూ వస్తోందని, ముఖ్యంగా అర్బన్ ఏరియాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఇంటి లోపల కానీ, ఇంటి బయట కానీ మంచి నీటి నిల్వల కు సంబంధించి తగిన జాగ్రతలు పాటించాలన్నారు. నిల్వ ఉంచుకున్న మంచి నీటి నిల్వలపై మూతలు మూసి ఉంచేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం "ఫ్రైడే – డ్రైడే" ను పాటించి దోమల నివారణకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.. మండల స్థాయి స్పెషల్ అధికారులు పర్యటనలకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా ప్రజలకు ఈ అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. మంచి నీటిలో ఉత్పత్తి చెందే దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వచ్చే అవకాశం ఉందని, అలాగే పగటి పూట దోమ కాటు వల్ల రోగ నిరోధక శక్తి తగ్గి అనారోగ్య బారిన పడే అవకాశం ఉన్నందున

ప్రజలకు విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ ఎస్వి. నాగేశ్వరరావు, డిఎంహెచ్ఓ రామగిడ్డయ్య, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదా పరిష్కార కమిషన్, విజయవాడ
ఎఫ్.ఎస్.ఓ. నెం. 153/2023
బిట్వీన్:
పంజాబ్ నేషనల్ బ్యాంకు లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ మరియు ఇతరులు ... అప్పిలెంట్
మరియు
షేక్ రమీజా మరియు ఇతరులు ... రెస్పాండెంట్
1. షేక్ రమీజా, వైఫ్ఆఫ్ అఫ్జల్ అలీ షేక్, డోర్ నెంబర్ 45/24-64/1, అశోక్ నగర్, కర్నూల్- 518005.
2. వి. ఉమామహేశ్వరీ, వైఫ్ఆఫ్ శ్రీనివాసులు, ఇన్సూరెన్స్ ఏజెంట్, కర్నూల్, హౌస్ నెంబర్ 248, ఆదిత్య నగర్, కర్నూల్ - 518002.
నోటీసు
అప్పిలెంట్ వారు డిస్ట్రిక్టు కన్స్యూమర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ కర్నూలు నందు నెం. /2021 నందు 2 మరియు 3 ప్రతివాదులు. వారు దాఖలు చేసిన అప్పీలు నందు
1. షేక్ రమీజాబీ, 2. వి. ఉమామహేశ్వరి, ఒకటి మరియు రెండు ప్రతివాదులకు గౌరవనీయ కమిషన్ వారు జారీ చేసిన నోటీసులు అందుకొనక 1 మరియు 2 ప్రతివాదులు కాలయాపన చేయుచున్న పరిణామములు, కమిషన్ వారు పర్సనల్ నోటీసు ఆర్డర్ చేసివున్నారు. అవి కూడా మీరు అందుకొనక కాలయాపన చేసి వున్నారు. కనుక, కమిషన్ వారు మీ ఇద్దరికీ పేపర్ ప్రకటన ద్వారా తెలియ పరచమన్నారు. పైన తెలిపిన కేసు నెంబర్ ది.05-09-2023న వాయిదా అయి వున్నది. కనుక మీరు ప్రత్యక్షంగా కానీ మీ ప్లీడరు ద్వారా కానీ కమిషన్ ముందు హాజరు కాగలరు.
వాయిదా : 05-09-2023
/// గౌరవ కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారం ///
జాగర్లమూడి వెంకటేశ్వర ప్రసాద్, అడ్వకేట్
డి.నెం.41-20/1-53/2, గుంటూరువారిస్ట్రీట్, కృష్ణలంక, విజయవాడ - 520013
సెల్:9440696216